# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

AUGUST 2013

సంవత్సర చందా రు.50/-

క్రీస్తుసంఘములు సమర్పించు

సత్యవాణి T.V. కార్యక్రమములను

ప్రతి ఆదివారము సాయంత్రం 6:00గం॥లకు శుభవార్త

ప్రతి బుధవారం సాయంత్రం 6:30 ని॥లకు రక్షణ

ప్రతి గురువారం మధ్యాహ్నం 2:30 ని॥లకు రక్షణ

ప్రతి శనివారం ఉదయం 8:00 గం॥లకు ఆరాధన

ఛానల్‌లలో వీక్షించండి.

ఉచిత బైబిల్ కరస్పాండెన్సు కోర్సులో చేరండి.ఆకోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి.ఈ రోజే మాకు వ్రాయండి.మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును.

మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్‌నెం.80,**

**కాకినాడ.ఎ.పి.**

**533 001**

**ఫోన్:0884 - 2363722**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | ఆగష్టు- 2013 | సంచిక - 1

## విభజనలు అవుసరమా ?
### (Is Christ Divided ?)

క్రీస్తు విభజింపబడి యున్నాడా? అను ప్రశ్నను అపొ. పౌలు కొరింధులోని క్రైస్తవులను ప్రశ్నించెను. కొరింధులో యున్న సంఘములో పార్టీలు ఏర్పడగా అతడు వారిని ప్రశ్నించి చీలికలు కలిగించు వారి స్వభావమును గూర్చి వ్యంగ్యముగా మాట్లాడెను. వారిని ప్రశ్నించుట ద్వారా ఖండించెను. "క్రీస్తు విభజింపబడి యున్నాడా?" క్రీస్తు విభజింపబడనేలేదు. పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా? కానేకాదు. అట్లయినప్పుడు నేను పౌలువాడను. నేను అపొల్లోవాడను, ఇంకొకడు కేఫావాడను అని చెప్పుకొనుట యెందుకు ? అని అతడు వారినడిగెను.

పౌలు అడిగిన ప్రశ్నలను నేటి క్రైస్తవ లోకమును మన మడుగవలసి యున్నది. ఎందువల్లనంటే నేటి క్రైస్తవ లోకము వందలకొలది డినామినేషనుల వలె విభజింపబడి యున్నది. క్రీస్తు విభజింపబడియున్నాడా? అట్లుకాని యెడల ఆయన అనుచరు లెందుకు విభజింపబడవలెను?

యేసు ఒకే ఒక్క సంఘమును స్థాపింతునని వాగ్దానము చేసెను.

'ఈబండమీద నా సంఘమును కట్టుదును' అని మత్తయి 16:18లో ఆయన పలికెను. ఎన్ని సంఘములు? ఒకే ఒక్క సంఘము. అవును నేడు లోకమందంతటా ఉండవలసింది ఒకే ఒక్క సంఘము. దేవుని పనులన్నియును పరిపూర్ణములు. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. మొదటి శతాబ్దములో జీవించిన పౌలు, పేతురు, యోహానులు ఆసంఘమునకు చెందిన వారు. మొదటి శతాబ్దములో జీవించిన భక్తులు ఇప్పుడు మన మధ్యకు తిరిగి వచ్చినయెడల ఈనాడు వారు ఏ సంఘస్థులగుదురు ? మొదటి శతాబ్దములో వారు ఏసంఘ సభ్యులో ఇప్పుడు కూడ సహజముగ వారు అదే సంఘ సభ్యులుగ యుందురుగదా? ఎందువల్లననగా వారానాడు యెరిగినదంతా ఒకే ఒక్క సంఘము. అది క్రీస్తు కట్టిన సంఘము. నేడు మన మెరిగిన చీలికలకు మానవుడే కర్తగాని దేవుడు కాదు (1కొరింధి 14:33). క్రీస్తు విభజింపబడలేదు.

క్రైస్తవులందరు ఏకమై యుండ వలెనని యేసు ప్రార్థించెను. "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున.... వాక్యమువలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" అని ఆయన పలికెను (యోహాను 17:20,21). ఈప్రార్థనను బట్టి యేసుక్రీస్తు యొక్క హృదయపూర్వక కోరిక యేమిటో మనము తెలిసికొనగలము. క్రైస్తవులలో ఐక్యత! ప్రభువు ఏకత్వము కొరకు ప్రార్థించితే వివిధశాఖలు, సంఘములు ఉన్నందుకు అనేకులు ఈనాడు దేవుని స్తుతింతురు. క్రీస్తు ఆత్మకు ఇది ఎంత విరుద్ధమో మనము ఇట్టే గ్రహించుకొన గలముగదా!

క్రైస్తవులందరు ఒకటిగా ఎందుకు ఉండవలెను? "నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు" అని యేసు అనుచున్నారు. ఐక్యతవలన విశ్వాసము నెలకొల్పబడిన యెడల విభజనలవలన అవిశ్వాసమేర్పడును. లోకములో యున్న అవిశ్వాసులకు కారణము విభజింపబడిన విశ్వాసులే యని మనము గుర్తెరుగవలెను.

విశ్వాసులందరు ఏకమై యుండులాగున అనగా క్రీస్తు శరీరములో ఏకమై యుండులాగున ఒకే ఒక్క శరీరమున్నదని బైబిలు పదేపదే మనకు బోధించుచున్నది (ఎఫెసీ 4:4;1 కొరింధీ 12:20; రోమా 12:4,5). ఆశరీరమే సంఘమై యున్నది (కొలస్స 1:18). ఒకేశరీరము, ఒకే సంఘము. "నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు చేసిన వాగ్దానముతో ఇది నమ్మైక్యత

కలిగియున్నది. అందుకే రక్షింపబడిన ప్రతివానిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెను అని వ్రాయబడి యున్నది. (అపొ.కా. 2:47)క్రీస్తు విభజింపబడలేదు!

ఏకత్వము ఐక్యతలు ఒక ఉపమానముద్వారా బైబిలునందు మనకు బోధింపబడినవి. ఒకేఒక్క ద్రాక్షతోటను గూర్చి యోహాను 15వ అధ్యాయములో బోధింపబడినది. ఒకే ఒక్క ద్రాక్షావల్లి యున్నది. ఆద్రాక్షావల్లి క్రీస్తు. క్రైస్తవు లందరు ఆయననుండి వచ్చిన తీగలు. ఒకే ద్రాక్షావల్లి నుండి వచ్చిన తీగ లన్నియు ఒకేరకమైన ఫలములనెట్లు ఫలించునో, క్రీస్తుయందు నిలిచియున్న ప్రతి వారు ఏకాభిప్రాయము, ఏకతాత్పర్యము కలిగి నడుచుకొనవలెను. ద్రాక్షవల్లిలో నుండి వచ్చిన తీగలన్నియు వ్యక్తిగత క్రైస్తవులనే సూచించు చున్నవిగాని వేర్వేరు డినామినేషనులను కాదు. అందుకే "ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పార వేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పార వేతురు, అవి కాలిపోవును" అని యేసు చెప్పెను (యోహాను 15:6).

ఐక్యతను సూచించుటకు దేవునికి అనేక కుటుంబములు గాక ఒకేఒక్క కుటుంబమున్నదని బైబిలు బోధించు చున్నది. ఆకుటుంబములో అందరికి యున్న తండ్రి ఒక్కడే ఆయన పరలోక మందున్న దేవుడు (మత్త 23:9). అట్లే ఒకే ఒక్కమందయు, ఒకే ఒక్క గొర్రెల కాపరియు ఉన్నారని యేసు బోధించెను. "ఈదొడ్డివి కాని వేరే గొర్రెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను; అవి నాస్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును" అని యేసు పలికెను (యోహాను 10:16).

అనేక అవయవములు కలిగిన మన శరీరమెట్లు ఏకమైపనిచేయునో అట్లే అనేక సభ్యులు కలిగిన క్రీస్తు సంఘము కూడ పనిచేయవలెనని అపొ.పౌలు బోధించెను: "శరీరమొక్కటే అవయవముగా ఉండక అనేకమైన అవయవములుగా ఉన్నది". "అటువలె మీరు క్రీస్తుయొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములునై యున్నారు". ఐక్యతను సంఘములో యున్న క్రైస్తవులు కలిగియుండవలెనని అపొ.పౌలు చేసిన హెచ్చరికలను 1కొరింధి 12:12-27 లో మీరు చదువగలరు. శరీరములో యెన్ని అవయవములున్నను, ఒకే ఒక్క శిరస్సును అది కలిగియున్నది. అట్లే సంఘములో అనేక సభ్యులున్నను సంఘమునకు ఒకేఒక్క శిరస్సుగా క్రీస్తు యున్నాడు. ఒక శిరస్సు క్రింద ఒకే

సంఘముగా క్రైస్తవులు నడిపింపబడగలిగిన యెడల ఐక్యతను సాధించుట సులభమే. క్రీస్తు విభజింపబడలేదు.

ఒకడు ఒకదానిని, వేరొకడు దానికి ఖచ్చితముగా భిన్నమైనదానిని క్రీస్తు నామమున బోధించవలెనని దేవుడు కోరుటలేదు. అయితే క్రీస్తునామమున బోధింపబడుచున్న నేటి సిద్ధాంతములను మనము పరిశీలించిన యెడల అవి ఒకదాని కొకటి పచ్చి విరుద్ధముగా యున్నవి. అయితే దేవుడు సమాధానమునకే కర్తగాని అల్లరికి కర్తకాడు (1కొరింధి 14:23). నేడు మన మధ్యనున్న మశాఖలకు దేవుడు కర్తకానేకాడు. సరిగదా ఆయన ఇట్లను చున్నారుః "శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే; అప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువ బడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మముఒక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే" (ఎఫెసీ 4:4-6).

బైబిలును మనందరము ఒకేరీతిగ అర్థము చేసికొనలేము గనుక ఇన్ని శాఖలు ఏర్పడినవని కొందరు చెప్పుచూయుంటారు. అయితే అది ఒక పచ్చి అబద్ధము. సరిగదా బైబిలు ఇట్లనుచున్నదిః "సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడ వలెననియు, మీలో కక్షలులేక యేక మనస్సుతోను ఏకతాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1కొరింధి1:10). అవును ఆత్మీయసంగతులలో ఐక్యతను సాధించుట సాధ్యమే.

అట్లయితే క్రైస్తవలోకము యెందువలన విభజింపబడి యున్నది? అని మీరడుగవచ్చును. బైబిలులో లేని సంగతులను ఆత్మీయ సత్యములని బోధకులు బోధించుటవలన విభజన లేర్పడినవి. విశ్వాసులు బాప్తిస్మము పొందవలెను, బాప్తిస్మమనగా ముంచుట, ప్రతి ఆదివారము ప్రభు రాత్రి భోజనము జరిగించవలెను, మనము క్రైస్తవుల మనబడవలెనను సంగతులపై మనము ఏకభిప్రాయమును కలిగి యున్నాము. ఎందువలన? వాటిని గూర్చి బైబిలు బోధించుచున్నందు వలన. అయితే శిశువు బాప్తిస్మము, చిలకరింపు, వివిధ మతశాఖల పేర్లు ధరించుకొనుట, మూడునెలలకో లేక సంవత్సరమునకో ఒక సారి ప్రభురాత్రి భోజనము నాచరించుట యను సంగతులపై మనము విభజింపబడి యున్నాము. ఎందువలన? వాటిని గూర్చి బైబిలు బోధించుట లేనందు వలన. దీనివలన బైబిలు బోధించు సంగతులను బట్టిగాక అది బోధించ లేనట్టి సంగతులపై క్రైస్తవ లోకము విభజింపబడి యున్నదని మనము

గ్రహించుకొనగలము.

ప్రపంచమందంతట క్రీస్తు సంఘములు చేయు విజ్ఞాపన ఒకే ఒకటి యున్నది : బైబిలు ఏమి పలుకునో దానినే మనం పలుకుదాం. బైబిలు యెక్కడ మౌనియై యున్నదో అక్కడ మౌనుల మగుదాం. బైబిలు సంగతులను బైబిలు పేర్లతో పిలుచుదాం. అన్ని విషయములలోను క్రీస్తునే వెంబడించుదాం. మానవులు, వారి స్వంతబోధలు మనలను విభజించును. అయితే క్రీస్తు విభజింపబడలేదు.

మాతో కలసి క్రొత్తనిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించకోరుచున్న యెడల ఈనాడే మాకు వ్రాయండి లేదా మీకు దగ్గరగా యున్న క్రీస్తుసంఘమును దర్శించండి!!

## దాచబడిన ధనమును గూర్చిన ఉపమానము
## (The Parable of the Hindden Treasure)

మత్తయి 13:44

**పరిచయము :**

దాచబడిన ధనము, గొప్ప విలువైన ముత్యములను గూర్చిన ఉపమానములు కవలలవలె మనకగుపడును. ఈరెండును రాజ్యము యొక్క విలువను తెలియ జేయుచున్నవి. హెబ్రీయుల సాంప్రదాయముగు సమానాంతరములను యివి తెలియజేయుచున్నవి. ఈరెండు ఉపమానములు, పెక్కు చేపలతో నిండిన వల, గృహయజమాని యొక్క ఉపమానము కూడ యేసు జనసమూహములను పంపివేసిన తరువాత కపెర్నహూములో ఒక యింటి లోనికి వచ్చి తన శిష్యులకు చెప్పినటువంటివి (మత్తయి 13:36).

దాచబడిన ధనమును గూర్చిన ఉపమానములో కొన్ని సంగతులు మన ఆసక్తిని రేకెత్తించును. ఈఉపమానములో నైతిక సమస్యతలెత్తునని కొందరు చెబుతారు. ఉదాహరణకు దాచబడిన ధనమును కనుగొనినవాడు దాని కనుగొన్న తరువాత దాని యజమానికి తెలియజేయుకుండా, ఆపొలమును కొనుట అనైతికము కాదా?

ఈ ఉపమానము దాచబడిన ధనమును కనుగొనిన వాని నైతికను గూర్చి చెప్పబడలేదు. ఈమనుష్యుని యొక్క ఉద్ధేశ్యములను, క్రియలను యేసు ఖండించలేదు, వాటిని ఆమోదించలేద కూడ. విసుగక నిత్యము ప్రార్థః

చేయవలెనని చెప్పిన సందర్భములో కూడ దేవుడు కఠినమైన తీర్పరిగా చిత్రీకరించబడ్డారని కొందరు చెబుతారు (లూకా 18:1-8). అయితే ఉపమానములో చెప్పబడిన ప్రతి సంగతి అనుకరించబడాలని చెప్పబడలేదు. ఉపమానము ద్వారా యేసు బోధింప దలచిన ముఖ్యాంశముకు మించి భావార్థము చెప్పకూడదు. అట్లు జరుగకుండా జాగ్రత్తవహించాలి. దాచబడిన ధనమును గూర్చిన ఉపమానములో ఒక వ్యక్తి దేవుని రాజ్యమును సంపాంధించుట కొరకు చూపు చురుకైన ఆసక్తి ముఖ్యముగా చెప్పబడినది.

ఆపొలము యొక్క యజమాని తన ధనమును ఎందుకు తిరిగి తనదిగా చేసికొనలేదు? దానినతడు ఎందుకు అమ్మతలంచాడు? కొనుగోలు చేయువాడు తనది గాని ఆస్థిలో ఎందుకు త్రవ్వకాలు జరిగించాడు అనునవి పనికిమాలిన ప్రశ్నలు. యేసు బోధింప దలచిన ఆత్మీయ పాఠమునకు అవి పనికిరావు. "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే మనము ఈ ధర్మశాస్త్రవాక్యములన్నిటిని అనుసరించి నడుచుకొనునట్లు బయలు పరచబడినవి యెల్లప్పుడు మనవియు మన సంతతి వారి వియునగును" (ద్వితి 29:29).

పురాతన పాలస్తీనా గృహములు కేవలము నిద్రపోవుటకు పనికివచ్చే నివాసములు మాత్రమే. ప్రశస్తమైన చరాస్థులను భద్రపరచుటకు అవి కేవలము ఉపయోగ పడవు. అయింటిలో ఎవరు వుండకపోతే దొంగలు పడకుండా చేయుటకు వాటికి కల్పించబడిన భద్రత శూన్యము (మత్తయి 6:19). మరియు ఒకని వ్యక్తిగత చరాస్థిని కూడ మోసుకొనిపోవుట మంచిది కాదు (లూకా 10:30). గనుక ప్రశస్థ ఆభరణములు వగయిరా భూమిలో దాచిపెట్టబడేవి (యోబు 3:21; సామె 2:4).

తూర్పు దేశ గ్రంధకర్త ఒకడు ఇట్లు వ్రాసాడు: "వంశములలో తరచు కలుగు మార్పుల వలనను, విప్లవముల వలనను ధనవంతులైనవారు తమ ఆస్థిని మూడు భాగములుగా చేయుదురు. దానిలో కొంత వ్యాపారములో వెచ్చింతురు. లేదా తమ పోషణ కొరకు వాడుదురు, ఒక భాగము సులభముగా తరలించగల ఆభరణములపై వెచ్చింతురు, మూడవ భాగమును భూమిలో పాతిపెట్టి దాచుదురు".

ఆరోజులలో తమ చరాస్థులను భద్రపరచుటకు బేంకులు లేనందున ప్రజలు తరచు వాటిని భూమిలో పాతిపెట్టేవారు. అయితే అట్లు దాచిపెట్టిన

యజమాని ఆకస్మికముగా చనిపోయి, దాని వివరములను ఇతరులకెవరికీ తెలియజేయకపోతే అట్టి ఆస్థిని తిరిగి పొందుట కష్టమే (మత్త 2:11; 6:19; 12:35; 15:21). తలాంతులను గూర్చిన ఉపమానములో ఒక్క తలాంతు పొందిన వాడు దానిని భూమిలో దాచిపెట్టెను (మత్త 25:18). కొందరు యూదులు ఇట్లు దాచిపెట్టబడిన ధనమును వెదికే అలవాటు కలవారు (యోబు 3:21; సామె 2:4).

ఈ ఉపమానములో ఆసంపదను కనుగొన్నవాడు దానిని అనుకొనని విధంగా ఆకస్మాత్తుగా కనుగొన్నాడని చెబుతారు. అయితే ఈ మనుష్యుడు దాచిపెట్టబడిన ధనమును ఎట్లు కనుగొన్నాడో యేసు చెప్ప లేదు. అయితే ఇట్లు దాచిపెట్టబడిన ధనమును వెదికేవారుండే వారని యిదివరలోనే మనము తెలిసికొన్నాము.

కొన్నిసార్లు అనుకోకుండా మనకు కొన్ని విలువైన వస్తువులు దొరుకుతాయి. రాజ్యమును గూర్చిన ఈ ఉపమానములో, పరలోక రాజ్యము దాచబడిన ధనమును (అనుకొనకుండా) కనుగొనుటను గూర్చి చెప్పబడినది. దానిని గూర్చి అతడు వెదకకపోయినా, అది కనబడినప్పుడు, కనుగొనినవాడు దానిని పొందుటకు ఆశతో అపేక్షించాడు.

నతనయేలు, యాకోబు బావిదగ్గర సమరయస్త్రీ కూడ తాము అనుకొనని ప్రశస్తమైన సంగతులను కనుగొనుట మనము చూస్తాము (యోహాను 1:43-49; యోహాను 4:4-30).

**ఉపమానము :**

"పరలోక రాజ్యము పొలములో దాచబడిన ధనమును పోలియున్నది ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి, అది దొరికిన సంతోషముతో వెళ్లి తనకు కలిగినదంతయు అమ్మి ఆపొలమును కను కొనును" (మత్తయి 13:44).

దాచబడిన ధనమును గూర్చిన ఈ ఉపమానములో పొలము ఈ లోకమునకు సాదృశ్యముగా యున్నది. గాని దానిలో ధనము మాత్రము ప్రాముఖ్యముగా పరలోక రాజ్యమునకు సాదృశ్యముగా కనబడుచున్నది. ఈ ఉపమానములో భౌతిక సంపదకు ఆత్మీయ సంపదకు గొప్ప తారతమ్యమున్నది.

"భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తిని వేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయముండును" (మత్తయి6:19-21)

భూసంపద యొక్క విలువ ఆయాకారణముల వలన తడబడచుండ వచ్చును. ఆత్మీయ సంపద యొక్క విలువ మార్పులేనిది, అమూల్యమైనది.

భూసంపదలకంటే పరలోక సంపద అమూల్యము ఎందువలననగా. 1) అది అన్నిటికంటే ప్రశస్తమైనది, దాని కొరకు చేసే ప్రయత్నాలన్నీ చేయాలి. 2) ఎక్కువ పెట్టుబడి పెట్టినా అంతకంటే ఎక్కువ పొందగలము 3) గొప్పత్యాగములు దాని కొరకు చేయవలసి వచ్చును 4) వ్యక్తి గతంగా పొందాలనే కాంక్ష అవుసరము 5) కాంక్షించుచున్న సంపదతో ఇప్పుడున్న సంపదకు పొందిక లేదు 6) ఈ సంపద కొరకు చేయవలసిన ప్రయత్నములన్నీ చేయాలి 7) దీనిని పొందుటకు ఒకడు సంతోషంతో తనకున్నవన్నీ వెచ్చించాలి.

ఆత్మీయ సంపదను గూర్చి పరలోక రాజ్యము కొరకు 1) అవుసరమైన త్యాగములన్నీ చేయాలి. 2) నిజముగా మార్పు జెందినవాడు తనగతాన్ని విసర్జించుటలో సణుగుకొనడు. 3)శిష్యత్వపు మూల్యము చెల్లించుటకు నిశ్చయించుకొనినవాడే రాజ్యములో ప్రవేశించును (లూకా 14:25-33). 4) ఈ ఆత్మీయ రాజ్య సంపదను పొందుటకు తన్నుతాను సంపూర్తిగా సమర్పించుకోవాలి. 5) ఈ ఆత్మీయ సంపద ఈలోకంలో బీదలైన వారికి కూడా లభించును.

దేవుడు దాని కొరకై వెచ్చించిన దానిని బట్టి ఈరాజ్యము అమూల్యమైనది. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తన్నుతాను తగ్గించుకొని మానవావతారియై సిలువ మరణమును సయితము సహించారు (ఫిలిప్పీ 2:5-8; హెబ్రీ 12:2-3). దేవుని కుమారుడైన యేసుక్రీస్తు యొక్క రక్తము దీనికొరకు వెచ్చించబడినది (అపొ.కా. 20:28; ఎఫెసీ 5:25).

దేవుని రాజ్యము యొక్క మూల్యమును అపొ.పౌలు గుర్తించాడు అందువలన ఈ లోకములో తనకేమేమి ప్రీతికరములో వాటన్నిటిని రాజ్యము కొరకు ఇష్టపూర్వముగా విసర్జించాడు (ఫిలిప్పీ 3:4-8). దానికొరకు అతడు అనేకశ్రమలను కూడ భరించాడు (2 కొరింథీ 11:23-28).

ముగింపు :

యోగ్యమైన మంచి మనస్సుగల ప్రతివాడు రాజ్యము యొక్క విలువను గుర్తిస్తాడు, సువార్తకు లోబడ్తాడు. తద్వారా దేవుడతనికి షరతులతోకూడిన ప్రవేశమును కల్పించును (అపొ.కా. 2:37-38;41,47). దానిలో ఆశీర్వాదములకు రాజ్యపు పౌరులే అర్హులు (ఎఫెసీ 1:3). రాజ్యములో

పౌరసత్వము పాపక్షమాపణతో ముడిపడి యున్నది (2 తిమోతి 2:10).

సంఘము యొక్క విలువను సరిగా అంచనా వేసినవారు దానిని గూర్చి అమితాసక్తిని వ్యక్తపరుచుదురు. రాజ్యములో జీవితము సంపూర్ణముగా నూతనమైనది (రోమా 6:3-4; అపొ.కా. 22:14,22). రాజ్యవిస్తరణ కొరకు వీరిపై క్రీస్తు సంఘము ఆధారపడి యుండును.

అయితే ఒకడు రాజ్యము యొక్క విలువను గుర్తించకపోయినను అది విలువైనదే. క్రైస్తవులు అమర్యాదగా నడుచుకొనుట వలన వారు సంఘమును కించపరచుదురు. ఇష్టపూర్వకముగా కూటములకు హాజరు కాకపోవుట వలనను (హెబ్రీ 10:25-27) వారు వెడలి వచ్చిన పాపములోనికి మరలుట వలనను సంఘమునకు వారు చెడ్డపేరు తెస్తారు (రోమా 6:2; 6:13). అట్టివారు మారుమనస్సు పొందాలి (లూకా 3:5; అపొ.కా. 2:38; మత్త 3:8).

దాచబడిన ధనము యొక్క ఉపమానము పరలోక రాజ్యము యొక్క అమూల్యమైన విలువను మనకు వక్కాణించుచున్నది. దాని యొక్క విలువను, రాజ్యము యొక్క అంతిమ విజయమును ఈపాఠం ద్వారా మనము గుర్తుంచుకోవాలి.

## దేవుని యందలి విశ్వాసము వలన విజ్ఞానము ప్రబలును
## (Belief in God Encourages Scientific Progress)

పరలోమందొక దేవుడున్నారు. మనకెట్లు తెలియును ? ఆయన సజీవుడైనవాడని నిస్సందేహ రుజువులను సమర్పించాము. అన్ని గొప్ప రుజువులున్నను కొందరు ఇంకను అవిశ్వాసులు గానే యున్నారు ఎందు వలన ? దేవుని యందలి విశ్వాసము వలన, క్రైస్తవ్యము ననుసరించుటవలన విజ్ఞానశాస్త్ర సంబంధమైన అభివృద్ధి కుంటుపడునని వారి యభిప్రాయము. దేవుని గూర్చి, క్రైస్తవ్యాన్ని గూర్చి అట్టి తిరస్కారము దోషసహితము.

**అబద్ధమతములు శాస్త్రీయ అన్వేషణను వ్యతిరేకిస్తాయి :**

అబద్ధమతములు కొన్నిసార్లు శాస్త్రీయ అభివృద్ధిని, అన్వేషణను ఆటంకపరచాయి. అదినిజమే. చాల కాలము వరకు ఈ అబద్ధమతములు భూమి బల్లపరుపుగా యుండెనని బోధించాయి. దానిని వ్యతిరేకించిన వారిని హింసించాయి. అట్టిబోధలు దేవుని నిజమైన బయల్పాటుపై ఆధారపడినవి కావు. అవి వారి మూఢనమ్మకములే.

దేవుని యదార్ధబయల్పాటగు బైబిలు "దేవుడు భూమండలమునై ఆశీనుడై యున్నాడని" (He Sitteth upon the CIRCLE of the Earth) బోధించుచున్నది (యెషయా 40:22). భూమి యొక్క వర్తులాకారమును గూర్చి చెప్పుచు ఆయన భూమండలముపై (Circle) ఆశీనుడై యున్నాడని మానవుడు ఆ సత్యాన్ని గ్రహించు కొనక ముందునుండే బైబిలు చెబుతు యున్నది. భూమిని ఏనుగులు, ఎద్దులు మోయుచున్నవని అజ్ఞానము వలన అబద్ధమతములు బోధిస్తు యుండేవి. గాని యోబు 26:7 లో " ఆయన శూన్యముపై భూమిని వ్రేలాడజేసెను" అని బైబిలు బోధించుచున్నది. దేవుడు చెప్పినది మానవుడు వినియుంటే, లేక బైబిలును సరిగ చదివియుంటే రోదసీలో భూమి యొక్క పరిస్థితిని గ్రహించుకొనే యుండును.

దేవుడు మానవునికిచ్చిన బయల్పాటకు బైబిలు గ్రంథము ద్వారా మానవుడు దేవుడు చెప్పునది గ్రహించుకొనకముందే అనేక విజ్ఞానశాస్త్ర వాస్తవములను తెలియజెప్పెను. ఉదాహరణకు బైబిలులోని మొదటి వచనము, "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను. చీకటి అగాధజలముపైన కమ్ముకొని యుండెను. దేవుని ఆత్మజలములపైని అల్లాడుచుండెనని" చెప్పుచున్నది (ఆది.కా. 1:1).

విజ్ఞానశాస్త్రమంతయుం కాలము, శక్తి, రోదసీ, పదార్థము, క్రియ అనువాస్తవములపై ఆధారపడి యున్నది. ఈవాస్తవములను తెలిసి కొనుటకు మానవునికి వేలకొలది సంవత్సరములు పట్టినవి. గాని మానవుడు బైబిలులోని మొదటి వచనమునే గమనించి యుంటే ఈవాస్తవములను ముందుగనే అతడు ఎరిగియుండును. ఆవచనము ఇట్లు చెప్పుచున్నది. "ఆదియందుం (కాలము) దేవుడు (శక్తి) భూమ్యాకాశములను (పదార్థము, రోదసీ) సృజించెను (క్రియ)". గనుక విజ్ఞాన శాస్త్రము ఆధారపడియున్న పంచవాస్తవములు, అనగా కాలము, శక్తి, పదార్థము, రోదసీ, క్రియయ నునవి బైబిలులో మొదటి వచనము లోనే చెప్పబడి యుండెను. దీనినిబట్టి దేవునియందు విశ్వాసము కలిగి యుండుట విజ్ఞానమునకు వ్యతిరేకమని ఎవరు చెప్పగలరు?

**సూర్యునికి ముందునుండే వెలుగు ఉన్నదని బైబిలు మొదటి నుండి చెప్పుచున్నది :**

మానవుడు గ్రహించుకొనని విజ్ఞాన వాస్తవములను బైబిలు చెప్పుచున్న మరొక దానిని

గమనించుదాము. బైబిలులోని మూడవ వచనము "దేవుడు -వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను" అని , చెప్పుచున్నది (ఆది.కా. 1:3). శాస్త్రవేత్తలమని చెప్పుకొను కొందరు ఈ వచనమును చాల కాలము హేళన చేసిరి. సూర్యుని నుండియే వెలుగు కలుగుచున్నదని వారునుకొనిరి. అందువలన ఈవచనము విజ్ఞాన శాస్త్రమునకు విరుద్ధమని ప్రకటించిరి. ఏలయనగా మొదటి దినమందే దేవుడు వెలుగును చేసెనని అది చెప్పుచున్నదిగాని నాల్గవ దినమువరకు సూర్యుడు చేయబడ లేదని బైబిలు చెప్పుచున్నది. "సూర్యుడు లేకుండగనే వెలుగున్నదని శాస్త్రజ్ఞులు నిరూపించారు! విద్యుచ్ఛక్తి ఇది యదార్థమని నిరూపించుచున్నది. విజ్ఞాన శాస్త్ర ప్రకారము మానవుడు నిరూపించక ముందు నుండే సూర్యుని అవుసరము లేకుండా వెలుగుండెనని బైబిలులో దేవుడు ముందుగనే తెలియజేసెను. దేవుడు తనబయల్పాటు ద్వారా మానవుని శాస్త్రీయ వాస్తవములకునడిపించును. అతని విజ్ఞాన వికాసమును ఆయన ఎన్నడు నిరోధించడు.

**విజ్ఞానవాస్తవముల విషయంలో బైబిలు యదార్థము :**

బైబిలు విజ్ఞాన శాస్త్రగ్రంథము కాదు. అది దేవుని బయల్పాటు గాని ఎప్పుడు విజ్ఞాన శాస్త్రవాస్తవములను పలికినా అది ఎల్లవేళలా ఖచ్చితము. అందువలన దేవుడు చెప్పునది విజ్ఞానశాస్త్ర వాస్తవములకు విరుద్ధమని ఎవడు చెప్పజాలడు.

దేవుని యందలి నమ్మిక విజ్ఞాన వికాసమును అడ్డుకొనునని నీవను కొనుచున్నట్లయితే ఇది గమనించుము: విజ్ఞానవికాసము ఎక్కడ సంభవించినది? అమెరికా లోను, యూరపులోను అని మనం ఎరుగుదుము. ఈ రెండు ఖండములలోను నిజదేవుని యందలి విశ్వాసము లేని ఆఫ్రికాఖండము యొుక్క పరిస్థితిని ఒకమారు గమనించుము.

**దేవుడు లేడను వారి వలన సమాజము కుంటుబడును :**

భూమి మీద కొన్ని దేశములు నాస్తికత్వమును బోధిస్తారు. అనుసరిస్తారు. నాస్తికుల బోధ ఆయా దేశాలలో ఆధునికమైనదే. విజ్ఞాన వికాసమును గూర్చిన ఆసక్తిని నిరోధించు రీతిగా ఆయా సమాజములలో నాస్తికత్వము ప్రబలలేదు. నాస్తికత్వము ప్రబలియున్న ఆయా దేశములలో సయితము పెద్ద పెద్ద క్రైస్తవదేవాలయములు నేటికీ యున్నవి. రాజకీయంగా నాస్తికులే అయినను ఆయాదేశాలలో ఎక్కువ మంది దేవునియందు నమ్మికగలవారే. ప్రేమ, విశ్వాసము, మంచితనము, సత్యము, దయ, కరుణ

ఇవన్నియు దేవుని యందలి విశ్వాసము వలన కలుగు ఫలములు. నాస్తిక దేశము లలో సయితము అనేకులు ఈలక్షణము లను కలిగియున్నారు. నాస్తికత్వము వలనగాకుండా ఈ దేశములు శాస్త్రీయ ముగా చాలముందుకు పోవుచున్నవి. పూర్ణముగా నాస్తికులున్న చోట సమాజము కుంటుపడును ఏలయనగా అక్కడ ప్రేమ, నిష్కాపట్యము మొదలగునవి నిష్క్రమించి వంచనకు దారితీయును, నమ్మికకు బదులు అపనమ్మకము ప్రబలును. వినయ మునకు బదులు గర్వము రాజ్యమేలును. ఓర్పు, క్షమగుణములు అంతరించి స్వార్థము ప్రబలును అందు వలన మనుష్యులు విజ్ఞతకోల్పోయి విజ్ఞాన వికాసమును పొందలేని వారగుదురు. ఇట్టి దేశములలో నాస్తికత్వము సంపూర్ణ అధికారమును సాధిస్తే ఒకటి రెండు శతాబ్ధములలో విజ్ఞానశాస్త్ర పరిశోధన అంతా అంతమగును. **- ఓటిస్ గేట్వుడ్.**

## బైబిలును గౌరవించుట
## (Respeating the Bible)

"గర్విష్టులు నామీద అబద్ధము కల్పించుదురు. అయితే పూర్ణహృదయముతో నేను నీ ఉపదేశములను అనుసరింతును... గర్విష్టులు నామీద అబద్ధములాడినందుకు వారుసిగ్గుపడుదురుగాక, నేను నీ ఉపదేశములను ధ్యానించుచున్నాను.. భూమిమీద నుండకుండ వారునన్ను నాశనము చేయుటకు కొంచెమే తప్పెను. అయితే నేను నీ ఉపదేశములను విడువక యున్నాను... నీ ఉపదేశమువలన నీవు నన్ను బ్రదికించితివి. నేనెన్నడు వాటిని విడువను" (కీర్తన 119:69,78,87,93).

ఈజీవిత సమస్యలు క్లిష్టతరమైన పుడు నీవు ఎటుతిరుగుదువు? బహుశా నీ మంచి మిత్రుని దగ్గరకో, తలిదండ్రుల దరికో, లేక బంధువుల యొద్దకో వెళ్లుదువు. లేదా సంఘసోదర సోదరీల యొద్దకు వెళ్లుదువు. వీరిదగ్గరకు వెళ్లుటమంచిదే గాని వారు నిన్ను దేవుని వాక్యము వైపుమళ్లింతురా? అంతా సక్రమముగా జరుగుచున్న పుడు మనం బైబిలును గౌరవిస్తాం. గాని సమస్యవస్తే దానిని ప్రక్కన పడవేస్తాం. అయితే బైబిలుబోధించు దానిని మనం ఆలోచిస్తే దేవునియందు నమ్మిక గలవారు ఎల్లవేళలా సమస్యలు ఎదుర్కొనినట్లు మనం గ్రహించు కొనగలము. మోషే. అబ్రాహాము, లోతు, ప్రవక్తలు మరీముఖ్యముగా యేసుక్రీస్తును గూర్చిఆలోచించుట

ద్వారా వీరందరుకూడ తమ జీవితాల్లో కఠోరమైన పరిస్థితులనెదుర్కొన్నారు. అయినను వారందరు విజేయులయ్యారు.

కీర్తనకారుడైన దావీదును గూర్చి అబద్ధాలు చెప్పారు, అతని నాశనం చేయాలని చూచారు, సమస్యలు సృష్టించారు గాని అతడు దేవుని ఉపదేశములనెన్నడు విడువలేదు. అంతగొప్ప విశ్వాసమునతడు కలిగియుండుటకు కారణం యేమిటి? "నీఉపదేశము వలన నీవు నన్ను బ్రతికించితివి" యని అతడు చెప్పుచున్నాడు (కీర్త 119:93). దేవుని వాక్యములో అతనికి బలమును, ప్రోత్సాహమును, నడిపింపును దొరుకునని కీర్తనకారుడు ఎరిగియుండెను.

మనలను గూర్చి ఎవరైనా అబద్ధములు చెబితే యేమి చేస్తాము? సిగ్గుమాలిన రీతిగా మన యెడల ప్రవర్తిస్తే? మనసమస్యలే మనలను ముంచివేసేలాగుంటే యేమి చేస్తాము ? చేతులెత్తేస్తామా? కోపగించుకొందుమా? ఆరాధనమాని వేస్తామా? లేక దేవుని వాక్యానికి హత్తుకొని యుందుమా?

అపవాది యేసుక్రీస్తును శోధించినప్పుడు ఆయన దేవుని వాక్యమును వినియోగించి దానిని ఎదిరించారు (మత్తయి 4). మన ప్రభువే దేవుని వాగ్దానములలో శక్తినిపొందియుంటే, అదే మనకు మంచి ఉదాహరణ కాదా? మనం ఆయనను తప్పక అనుకరించాలి.

క్లిష్టపరిస్థితులనెదుర్కొనుచున్నప్పుడు బైబిలునందలి మన విశ్వాస గౌరవముల నిజపరీక్ష మొదలగును. కీర్తనకారునివలె, మనం ఎన్నిసమస్య లెదుర్కొనినను దేవుని వాక్యమునుండి వైదొలగమని నిశ్చయించు కొందము. దేవుని వాక్యములోనే నిత్యజీవమున్నదని యెరిగి దానినుండి తొలగిపోరాదు.

– స్టీవ్ స్నైడర్

## దాసుని హృదయుము

## (A Servant's Heart)

1 కొరింథీ 9:19–23

నీజీవితంలో నీవు ఏమి అవ్వాలని కోరుకుంటావో ఎన్నుకో. అంటే నీవు బహుశః ఒకడాక్టరు, లాయరు, వ్యాపారవేత్త, హాస్యగాడు, అటగాడు, నాయకుడు లేదా ఒక దేశానికి అధ్యక్షుడు కావాలనుకుంటావు. నిన్ను ఒకటి అడుగనియ్య: నీవు ఒక బానిసగా ఉండడానికి ఎంచుకుంటావా? బానిసలు చాల దయనీయంగా చూడబడతారు.

మనదేశంలో కొందరు, పనివారిని బానిసలుగా చూస్తారు. అయితే ఫిలిప్పీ పత్రిక 1:1 లో పౌలు తనను తాను ఇలాగే వివరిస్తున్నారు "క్రీస్తుయేసు దాసులైన పౌలును తిమోతియును" "అంటున్నాడు. పౌలు ఇంకాఇలా అంటున్నారు: తాను బంధకముల లోనున్న బానిసను"అని ...రోమా చట్ట ప్రకారము బానిసకొనబడి అమ్మబడే వస్తువు. బానిసత్వంలో వ్యక్తి వివాహం చేసికోకూడదు, న్యాయ్యస్థానంకి వెళ్లకూడదు, లేదా ఆస్తిని కలిగి ఉండకూడదు, నేరము చేస్తే తమ యజమానుల వద్ద నుండి చాల కఠినమైన శిక్షను పొందేవారు. రోములాంటి పెద్ద పట్టణాలలో జనాభాలో మూడు వంతుల మంది బానిసలే. బానిసలు తమది అని చెప్పేకాలము (సమయము) వారికి లేదు. ప్రతిక్షణము యజమానిదే, యజమాని అవసరతకు అందుబాటులో ఉండాలి. బానిసత్వము అంటే ఒక వ్యక్తి మరోవ్యక్తికి పూర్తిదాసోహం. యజమాని యొక్క ఇంటి సామగ్రిలో బానిస ఒకటి.

రోమా చట్టం క్రింద యజమానుడు ఎలాగవాడుకొని పడవేయాలనుకుంటడో అలా బానిసను వాడుకొని పడవేయవచ్చు యుద్ధంలో పట్టుబడడం ద్వారా కొందరు బానిసలవుతారు, కొందరు బానిసత్వం కొరకు దొంగిలింపబడేవారు, కొందరు నేరము చేసి ఋణం తీర్చడానికి గాని, ఋణం చెల్లించడానికి గాని బానిసలుగా అమ్మబడేవారు. కొందరు బానిసత్వంలోనే జన్మిస్తారు, గాని కొందరు తమ యజమానుని మీద ఉన్న ప్రేమవల్ల స్వచ్ఛందంగా బానిసలవుతారు.

ఒకడు స్వచ్ఛందంగా బానిసగా ఎలా అవుతాడు అని కొందరు అడుగవచ్చు. దానికి, పాతనిబంధన కారణం చెబుతుంది నిర్గమ 21:2-6 లో ఇలా చెప్పబడింది. "నీవు హెబ్రీయుడైన దానుని కొనిన యెడల ఆరు సంవత్సరములు దానుడైయుండి యేడవసంవత్సరమున ఏమియు ఇయ్యకయే నిన్ను విడిచి స్వతంత్రుడగును వాడు ఒంటిగా వచ్చినయెడల, ఒంటిగానే వెళ్లవచ్చును. వానికి భార్యయుండిన యెడల వాని భార్య వానితో కూడ వెళ్లవచ్చును. వారి యజమానుడు వానికి భార్యనిచ్చిన తరువాత ఆమె వాని వలన కుమారులనైనను కుమార్తెలనైనను కనినయెడల ఆభార్యయు ఆమెపిల్లలును ఆమెయజమానుని, నాభార్యను, నాపిల్లలను ప్రేమించుచున్నాను. నేను వారిని విడిచి స్వతంత్రుడనై పోనొల్లనని నిజముగా చెప్పిన యెడల వాని

యజమానుడు దేవుని యొద్దకు వానిని తీసికొని రావలెను, మరియు వాని యజమానుడు తలుపునొద్దకైనను ద్వారబంధమునొద్దకైనను వానితోడు కొనిపోయి వాని చెవిని కదురుతో గుచ్చవలెను. తరువాత వాడు నిరంతరము వానికి దాసుడై యుండును".

వారితో వ్యక్తిగతమైన కోరికకంటే బలమైన శక్తి ఉండుట వల్ల ప్రజలు స్వచ్ఛందంగా బానిసలవుతారు. ఆశక్తి ప్రేమ. 2కొరింథీ 5:14,15లో ఇలా ఉంది – "క్రీస్తుప్రేమ మనలను బలవంతము చేయుచున్నది. ఏలాగనగా అందరికొరకు ఒకడు మృతిబొందెను గనుక అందరు మృతిపొందిరనియు జీవించువారు ఇకమీదట తమకొరకు కాక తమనిమిత్తము మృతిపొంది తిరిగి లేచిన వానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొనుచున్నాము". మనకొరకు మృతిచెందిన క్రీస్తుప్రేమ ఎంత బలమైనదంటే –నిత్యము అయనకు సేవకులుగా ఉండుటకు మనజీవితాలను ఆయనకు ప్రమాణం చేస్తున్నాము. మనము ఆయన వారము.

ఎట్టి భయములేకుండా మనము దీనిని చేయగలము, ఎందుకంటే సేవకుడుగా ఉండుట అంటే ఏమిటో మన ప్రభువైన క్రీస్తునకు తెలును. యేసుప్రభువుఒక సేవకునిగా ఉండుటకే ఎంచుకున్నారు. వారు ప్రభురాత్రి భోజనమును ప్రారంభించిన రాత్రి యేసు ప్రభువు లేచి తన పైవస్త్రం అవతల పెట్టి వేసి ఒక తువాలు తీసికొని నడుముకు కట్టుకొనిన తరువాత పళ్లెములో నీళ్లు పోసి శిష్యుల పాదములు కడిగి తాను కట్టుకొనిన తువాలుతో తుడిచారు.

యోహాను 13:12-17 నుండి ఇలాఉంది : వారి పాదములు కడిగి తన పై వస్త్రము వేసికొనిన తరువాత ఆయన మరల కూర్చుండి. "నేను మీకు చేసినది మీకు తెలిసినదా? బోధకుడనియు ప్రభువు అనియు మీరు నన్ను పిలుచుచున్నారు నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును బోధకుకుడవైన నేను మీపాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములు ఒకరు కడుగ వలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని. దాసుడు తనయజమానుని కంటే గొప్పవాడు కాడు, పంపబడిన వాడు తన్నుపంపిన వానికంటే గొప్పవాడుకాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఈసంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసిన యెడల మీరు

ధన్యులగుదురు. నాస్నేహితుడా! దాసుని హృదయమంటే అది.

మనలను ఆయన ఏరకమైన ప్రజలుగా ఉండాలని కోరుతున్నారో చూపించుటకు గాను యేసుప్రభువు దాసుని పాత్రను తీసుకొన్నారు. దేవుని దృష్టిలో దాసుడు గొప్పవాడయ్యేకొద్ది ఆవ్యక్తి గొప్పవాడు. మత్తయి 23:11-12 లోఇలా ఉంది: "మీలో అందరికంటే గొప్పవాడు మీకు పరిచారకుడు. తనను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును. తన్నుతాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును." దీన మనస్కుడై ఇతరులకు పరిచర్య చేయుటకు ఇష్టపడు వానిని దేవుడు ఆశీర్వదిస్తారు. 1పేతురు5:5 లో ఇలా చెప్పబడింది -" దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును".

మత్తయి 5:3లోని కొండ మీద ప్రసంగము "- ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు, పరలోకరాజ్యము వారిది" అంటూ ప్రారంభించబడింది. ఆత్మలో ధన వంతుడైన వాడు పూర్తిగా స్వయం అని యేసు ప్రభువు ఎరుగును. అటువంటి వ్యక్తిని యేసుప్రభువు వాడుకొనరు. ఆత్మలో బీదయైన వ్యక్తి తనకు ప్రభువు అవసరం అని ఎరుగును, ఆయన లేకుండ తాను జీవించలేనని ఎరుగును గాని తనకుతాను అనుకొనే వ్యక్తిఎలాఇష్టమయితే అలా జీవిస్తాడు, ఒక యజమానుని అక్కర గుర్తించడు. ఎవరైతే దేవుని ప్రేమిస్తారో, ఎవరైతే ఆయన అవసరత కలిగి ఉంటారో వారే దేవుని ఆశీర్వాదంకనుగొంటారు. మనకు ప్రభువు అవుసరం మనం దేవుని జ్ఞానం, సహాయం, దేవుని ప్రేమ లేకుండా జీవించలేము.

యేసుప్రభువు కేవలం పాదములు కడుగుటయేగాక దాసుని కంటే ఇంకా అధికంగానే చేసారు. నీవు నీతి మంతుడవు పాపరహితుడుగా ఉండులాగున ఆయన తన శరీరమును శిలువపైన అర్పించెను. దేవుని దృష్టిలో నీకు స్థానం కలుగులాగున ఆయన శూన్యం ఆయ్యారు. ప్రాణము కంటే అధికముగా ఆయన నిన్ను ప్రేమించారు.

నీ నిమిత్తము యేసు ప్రభువు తండ్రికి విధేయులయితే నీవు ఆయనకు వీధేయుడవుకావా? హెబ్రీ 5:8-9లో ఇలాఉంది -"ఆయన కుమారుడై యుండియు తానుపొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధిపొందినవాడై మెల్కిసెదెకు యొక్క క్రమములో చేరిన ప్రధాన యాజకుడని దేవుని చేత పిలువబడి తనకు విధేయులైన వారికందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను". దేవునికి నమ్మకమైన సేవకుడుగా ఉండాలనుకుంటే నీవు

కూడా విధేయుడగుటకు నేర్చుకొనవలెను. నమ్మకమైన సేవకుడు దానిని తన గురిగా కలిగి ఉంటాడు.

సేవచేయాలి అనే ఆశకలిగిన ఒక నమ్మకమైన క్రైస్తవుడు ఒక పెద్దాయనను ఇలా అడిగాడు –"నేను దాసుడను అని ఎలా తెలిసికొనగలను?" పెద్దాయన జవాబిచ్చారు –"ప్రజలునిన్ను ఒకనిగా పరిగణించినపుడు, నిన్నుపేదవానిగా పరిగణించినపుడు లేదా ఏదైన ఒక పనిని చేయమని అధికారపూర్వకంగా నిన్ను అడిగినపుడు ఒక దాసుడు అంటే అర్థమేమిటో నీవు తెలుసుకొంటావు మనందరిలో ఉన్న మానవుడు అతిశయించి అడుగుతాడు – "నేనెవరినో నీకు తెలియదా? అని గాని మనం మన ప్రభువైన యేసు వైపు చూచినపుడు మనం ఆయన దాసులము తప్ప మరేమి కాదు అనే విషయాన్ని గుర్తుంచుకుంటాము. దీనత్వంలో కప్పబడి యేసుక్రీస్తు లోకమునకు వచ్చినందువల్ల దీనత్వం ధరించిన వారిమధ్యనే ఆయనను ఎల్లపుడు చూస్తాము.

ఫిలిప్పి 2:14-16 ను బట్టి "మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములును మాని సమస్తకార్యములను చేయుడి. అట్టిజనము మధ్యను మీరు జీవ వాక్యమును చేతపట్టుకొని లోకమందు జ్యోతులవలెకనబడుచున్నారు. "దేవునిని సేవించడం, మనచుట్టునున్న ఇతరులను సేవించడం కష్టతరంగా అనిపించవచ్చు, గాని మనం ప్రజలకు కాక దేవునికి సేవచేస్తున్నామనే తలంపుతో ఆసేవను చిరునవ్వుతో చేద్దాం. స్వార్థమైన చీకటిలోకంలో తమంతటతాము స్వచ్ఛందంగా ఇతరులమంచికొరకు పనిచేసేవారు ఉన్నారని తెలిసికొనడం ఎంతో రమ్యమైనది.

మార్కు 10:42-45 లో యేసు ప్రభువు ఆయన శిష్యులతో "అన్యజనులలో అధికారులని యెంచబడినవారు వారిమీద ప్రభుత్వము చేయుదురు, వారిలో గొప్పవారు వారిమీద అధికారము చేయుదురని మీకు తెలియును. మీలో అలాగు ఉండకూడదు మీలో ఎవడైనను గొప్పవాడై యుండగోరిన యెడల వాడు మీకు పరిచారము చేయువాడై యుండవలెను. మీలో ఎవడైనను ప్రముఖుడై యుండగోరిన యెడల వాడు అందరికి దాసుడై యుండవలెను. మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన

ప్రాణమును ఇచ్చుటకును వచ్చెననెను".

"చాల సంఘాలు "నాకు ఏమికావాలి", "నాకు" ఏది ఇష్టం, అనే దానినే విషదం చేస్తారు. నాగురించి నేను మంచిగా భావించేలా సంఘం చేయాలి గాని వారు నన్ను మార్చడానికి ప్రయత్నించకూడదు అనుకుంటారు. గాని బైబిలులోని క్రైస్తవ్యము సేవచేయించుకోవడం గురించి కాదు. అది దేవునిని ఇతరులను సేవించడం గురించి. అది స్వయం కోసం చనిపోయి ప్రభువు కోసం బ్రతకడమును గూర్చి. గలతీ 2:20లో పౌలు "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను, ఇకను జీవించువాడను నేను కాను ఆయన దేవుని సేవించుటకు, మానవుని కొరకు తన ప్రాణం యావత్తు ధార పోసారు. పరలోకపు మహిమనంతటిని విడిచి నీవు నేను క్షమాపణ, నిరీక్షణపొందునట్లు భూలోకమునకు వచ్చి మానవుడైనాడు. ఫిలిప్పి2:5-8 బైబిలులోని అతిగొప్ప వచనాలలో ఒకటి "క్రీస్తుయేసునకు కలిగిన యీమనస్సే మీరును కలిగియుండుడి ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి, దేవునితో సమానముగా నుండుట విడిచి పెట్టకూడని భాగ్యమని యెంచుకొన లేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను".

ఒక సామాన్యమైన నేరస్తునిలాగ ఇస్కరియోతూ యూదా ఆయనను బంధించాడు, అన్యాయపు తీర్పుపొందారు ఆయనను కొట్టారు, అపహసించారు, పేతురు ద్వారా తిరస్కరింపబడ్డారు, హింసింపబడ్డారు. సిలువమోయడానికి బలవంతం చేయబడ్డారు. వస్త్రాలను పెరికి వేసారు, జనసమూహముల ఎదుట సిలువకు కొట్టబడ్డారు. ఇది బాధతో కూడిన బహిరంగమైన హీనమైన మరణం. సిలువకు వెళ్లడం అంత తేలికకాదు గెత్సెమనె తోటలో యేసు ప్రభువువారుగడిపిన సమయము నిజంగా చాలకష్టతరమైంది. ఆయన శిలువను మోయవలసి ఉంటుందని యేసు ప్రభువుకు తెలుసు. తోటలో ఆయన మోకరించి ఇలా ప్రార్థించారు "తండ్రీ యీగిన్నె నాయొద్దనుండి (తొలగించుటకు) నీచిత్తమైతే తొలగించుము. అయినను నాయిష్టము కాదు, నీచిత్తమే సిద్ధించును గాక అని ప్రార్థించెను". అదే ఒక దాసుని యొక్క హృదయము ప్రాణము.

సిలువ మీద మరణించుటకు

యేసు ప్రభువు ఎందుకు ఎన్నుకున్నారు? ఎందుకనగా ఆయన తన తండ్రి తనను ఏమి చేయమని కోరుతారో దానిని చేయుటకు ఆయన వచ్చారుగనుక. నమ్మకస్థుడైన దాసునివలె యేసుప్రభువు ఫిర్యాదుచేయలేదు. తండ్రితో వాదించనులేదు లేదా ఆయన శత్రువులపై పగతీర్చుకొననులేదు. "నేనే ఎందుకు ప్రభువా ?" అని అడుగలేదు. ఆయనచేయ వలసినది నిర్లక్ష్యంచేయ లేదు. అవమానిం పబడడం, సిలువ వేయబడడం అనే తలంపును ఆయన అసహ్యించు కున్నారుగాని దానికి ఆయన ఇష్టపడ్డారు. ఆయన విధేయుడు. యేసు ప్రభువు అన్నికాలములకు ప్రజలందరికి నిజమైన దాసుడు.

పరమందున్న తండ్రి మనం ఏంకావా లనుకుంటున్నారో దాని మాదిరియే నీకు నాకు కూడా సేవచేసారు. 2కొరింధీ 8:9 ఇలాఉంది "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీనిమిత్తము దరిద్రుడాయెను". ఆయన తన తండ్రికి విధేయుడైనాడు అది ఆయన ఎందుకు చేసారంటే మనకు పరలోకము నందు ఒక గృహాన్ని ఇవ్వడానికి. 1 పేతురు 2:24 "ఆయన తానే తన శరీరమందు మనపాపములను మ్రానుమీద మోసికొనెను ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి".

ఫిలిప్పి 2:3-4లో ఏమి చెప్పబడిందో దానిని యేసుప్రభువు అనుసరించారు "కక్షచేతనైనను వృథాతిశయము చేతనైనను ఏమియు చేయక వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను". అది ఒక దాసుని హృదయము. ఆయన అవసరతలకంటే నీఅవుసరతలు ప్రాముఖ్యమైనవని యేసుప్రభువు తలంచారు. నేను కాను, క్రీస్తేనాయందు జీవించుచున్నాడు నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నాకొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసమువలన జీవించుచున్నాను". అంటాడు.

మనము దేవుని బానిసల మైనట్లయితే నిర్విద్ధంగా దేవుడు మన జీవితాలకు యజమానుడు. "నేను ఏమికోరను ?" అని అడగము గాని దేవుడు "నేనేమిచేయాలని కోరుతు న్నాడు"? అని అంటాము. మన సమయం, మన తలాంతు, మన హృదయం, మనజీవితాలు దేవునికి చెందుతవి. యోహాను 8:29 లో

"ఆయన కిష్టమైన కార్యమునేనెల్లప్పుడు చేయుదును'' అని యేసుప్రభువు అంటున్నారు. ఆసేవకుని హృదయాన్ని మనం అనుకరించాలి.

రోమా 6:16లో "లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో అది చావు నిమిత్తముగా పాపమునకేగాని నీతినిమిత్తముగా విధేయతకేగాని దేనికి మీరులోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా? ఒక్కొక్కరము ఒక యజమానుని ఎన్నుకొంటున్నాము. నీవు నీ కోరికలను సేవించుటకు ఎంపిక చేసికొనవచ్చును గాని అది ఏమి సాయం చేయదు. నీవు ప్రభువును సేవించుటకు ఎన్నుకొనినట్లయితే, ఆయన నిన్ను నీకలలను అతీతంగా దీవించును, ఘనపరచును.

విధేయత ద్వారా మనం ప్రభువును ఎంపిక చేసుకుంటాము. రోమా 6:17-18 లో మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యేఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా మీరు లోబడినవారై, పాపములకు పశ్చాత్తాప పడి, ఆయన దేవుని కుమారుడని ఒప్పుకొని క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు ఆబోధకు మనం ప్రేమతో విధేయులమవుతాం బాప్తిస్మములో మన పాపములు కడిగివేయబాడతవి. అపుడు మనము నీతికి దాసులము, దేవుని పిల్లలము. నీవు దేవుని బిడ్డవు అవ్వవా?

– రిక్కీ గూటం

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

# సంక్షిప్త వార్తలు

2013 జూలై నెల 23వ తేదీ మంగళవారము నాడు కృష్ణాజిల్లా నూజివీడులో జరిగిన సువార్తికుల సదస్సు, ఒకరోజు బైబిలు క్లాసు అత్యంత ఘనముగా జరిగినది. సహో.ఓర్సు ఆదాము గారి నాయకత్వమున బైబిలు క్లాసు నిర్వహించబడినది. నూజివీడు క్రీస్తుసంఘ ఆవరణలో సకాలమునకు అనేకమంది సువార్తికులు,సంఘసభ్యులు కూడి వచ్చిరి. ఆరోజు జరిగిన సదస్సుకు రెడ్డిగూడెంలో పనిచేయుచున్న ఓర్సు నాగేశ్వర రావు గారు అధ్యక్షత వహించి సమర్ధవంతముగా సభను నడిపించిరి. సోదరులు ఓర్సు ప్రసాదరావు గారు ప్రారంభ ప్రార్థన చేయగా సోదరులు జాషువాగూటం గారు వాక్యోపదేశముగావించిరి. 'క్రీస్తు బోధయందు నిలిచియుండుట' అను అంశముపై సదస్సు జరిగెను.

బోధయనగా విశ్వాసనియమము,ఉపదేశము అని చెప్పుకోవచ్చు. బైబిలు బిలాము బోధను గూర్చి, నికోలాయితుల బోధను గూర్చి,దయ్యముల బోధనుగూర్చి, అబద్ధబోధను గూర్చి హెచ్చరిక చేయుచున్నది. నిజ విశ్వాసులు క్రీస్తుబోదయందు, క్రొత్తనిబంధన బోధయందు నిలచియుంటే ఆత్మీయముగా ఫలిస్తారని,తండ్రియైన దేవుడు ఘనపరచబడతాడని సోదరులు ఉపదేశించిరి. మద్యాహ్న కాల కూటములో ఓర్సు ప్రభుదాసు గారు ప్రార్ధన చేయగా ఓర్సు ఆదాము గారు వాక్యోపదేశముగావించిరి. సాయంకాల స్త్రీలకూడికలో సోదరి కబిత గూటం గారు స్త్రీల నుద్దేశించి చక్కటివాక్యో పదేశము గావించిరి. ఓర్సు ప్రసాదరావు గారి ఆఖరి ప్రార్ధనతో ఆదాము గారి వందన సమర్పతో నాటి సదస్సు ముగిసెను. స్థానిక క్రీస్తుసంఘము వచ్చినవారందరికి మంచి భోజనాలు సరాఫరా చేసిరి. అందరు సంతోషముతో,నూతనోత్సాహముతో తమ తమ గృహములకు చేరుకొనిరి.

2013 జూలై 29,30తేదీలలో సోదరులు జాషువాగూటం గారు తెలంగాణలో సువార్త సేవార్థమై పర్యటించి పలుచోట్ల వాక్యపరిచర్యచేసిరి. ముఖ్యముగా మెదక్ జిల్లా కల్లాకాల లోను, మేడ్చల్ దగ్గర యున్న తూప్రాన్ పట్టణంలోను వాక్య పరిచర్యచేయగా ప్రజలు

ఆసక్తితో సత్యవాక్యమును వినిరి. కొందరు తాము వాడుచున్న వాద్యసంగీతమును విసర్జించుటకు నిశ్చయించుకొనిరి. కల్లకాలలో పి. మోజెస్‌గారును, తూప్రాన్‌లో కూరం స్వామిదాసు, సామ్యుల్ రాజు గార్లు పరిచర్యచేయుచున్నారు. నిజామాబాద్ జిల్లా ఈదరపల్లిలో పనిచేయుచున్న సోదరులు టి. డేవిడ్ రాజు గారు జాషువాగూటం దంపతుల పర్యటనలో ఎంతగానో సహాయపడిరి. మరియు సికింద్రాబాద్ యాప్రాల్‌లో యున్న సోదరులు లెమూయేల్ ఆచారియా గారి సహయ సహకారములు ప్రశంసనీయము. భవిష్యత్తులో తెలంగాణాలో క్రీస్తుసంఘము బలముగా నాటబడి పనిచేయునట్లు చదువరులు ప్రార్థించమనవి.

జాషువాగూటం దంపతులు తెలంగాణా పర్యటన ముగించుకొని ఆగస్టు మొదటి తేదీనాటికి సురక్షితముగా గృహము చేరుకొనిరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004